## క్లుప్తంగా

### మంత్రికి బీఆర్‌ఎస్ నేతల కృతజ్ఞతలు



మంత్రి హరీశ్‌రావుకు మొక్కను బహూకరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్ టౌన్: మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.30లక్షల నిధులు మంజూరూ చేసినందుకుగాను జహీరాబాద్ బీఆర్‌ఎస్ నాయకులు శనివారం మంత్రి హరీశ్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు నామ రవికిరణ్ గుప్తా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత జహీరాబాద్‌కు వివిధ గ్రాంట్‌ల ద్వారా రూ.114.5కోట్ల నిధులు మంజరైనట్టు తెలిపారు. తాజాగా రూ.30 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షనీయమన్నారు. మంత్రిని కలిసినవారిలో నాయకులు యూనూస్, యాకూబ్, నరేష్‌రెడ్డి, రాజారమేష్ ఉన్నారు.

### పోలీసులకు రెయిన్‌కోట్లు పంపిణీ



రేయిన్‌కోట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీసులు ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న పోలీసులకు ముత్తుట్ ఫైనాన్స్ సంస్థ సహకారంతో సురక్షా సేవా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా శనివారం రేయిన్‌కోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న పోలీసులందరికీ రెయిన్‌కోట్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ మేనేజర్ యమగాని లక్ష్మీనారాయణ, రీజనల్ అడ్మిన్ మేనేజర్ బిందు, సునీత, సురక్షా సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిక్కర గోపీశంకర్ యాదవ్ పాల్గొన్నారు.

### వసతిగృహాల సందర్శన



సీసీ ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

నారాయణఖేడ్: వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఆర్డీఓ కార్యాలయంలో సీసీ ఈశ్వర్‌కు కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింహులు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ ఖేడ్ పట్టణంలోని మైనార్టీ, జ్యోతిబాపూలే గురుకులాలు ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయన్నారు. వసతిగృహాల్లో కనీస సదుపాయాలకు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, డివిజన్‌స్థాయి అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు గణపతి, నర్సింహులు, అరుణ్‌కుమార్, శంకర్, రమేష్, శివానంద్, నవీన్ పాల్గొన్నారు.

### ఎస్ఐ సుభాష్‌కు సన్మానం



ఎస్ఐ సుభాష్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హత్నూర (సంగారెడ్డి): ఇటీవల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సుభాష్‌ను ఆయా పార్టీల నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్రె కృష్ణ, గుండ్లమాచనూర్ సర్పంచ్ శేషరెడ్డి, పల్పనూరు సర్పంచ్ కవిత ఆంజనేయులు, ఉపసర్పంచ్ మల్లేశం, చింతలచెరువు ఎంపీటీసీ భాస్కర్, నాయకులు నరసింహారెడ్డి, దయాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లేశం, శ్రీకాంత్, అంబటిబాబు, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చార్ల సందీప్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నాగప్రభుగౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐని సన్మానించారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు ముక్కిడి రాములు, నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ఎస్ఐ సుభాష్‌ను ఘనంగా సన్మానించారు.

# నిఘా నీడన తెల్లాపూర్

- కాలనీలు, ప్రధాన రహదారులపై సీసీ కెమెరాల ఏర్పాట్లు
- ప్రజాభద్రతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న తెల్లాపూర్ మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందుతుండటంతో ప్రభుత్వం తెల్లాపూర్ మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగానే సర్కార్ ఇటీవల కొల్లూర్ పోలీస్‌స్టేషన్‌ను మంజూరు చేసి ప్రారంభించింది. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడుతున్నవారికి భద్రత కల్పించాలన్న లక్ష్యంతో మున్సిపాలిటీ పరిధిలో రూ.1.45కోట్లతో 383 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు సర్వసభ్య సమావేశంలో ఇటీవల తీర్మానం చేయగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. దీంతో ఇప్పటికే విద్యుత్‌నగర్ కాలనీ, వార్డు నెంబర్ 7, 9, 10లలో 167సీసీ కెమెరాలు, 11, 6, 8లలో 100సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కొల్లూర్, ఈదులనాగులపల్లి, వెలిమెలలో మరో 125సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తుండటంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



**పోలీసుల సూచనల మేరకు సీసీ కెమెరాలు**

పోలీసు అధికారుల సూచనల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద ఉండే రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు రూ.25లక్షలతో ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. దీంతో వాహనాల నెంబర్‌లను, వ్యక్తులను స్పష్టంగా గుర్తించే అవకాశం ఉంటుంది.



ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

**24గంటలు పర్యవేక్షణ**



సీసీ కెమెరాలున్న ప్రాంతాలు 24గంటలు పర్యవేక్షణలో ఉంటాయి. వీటిని హైదరాబాద్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానంగా పనిచేస్తాయి. శాంతిభద్రతలకు ప్రతిఒక్కరూ సహకరించాలి. నేరాల అరికట్టడంలో సీసీ కెమెరాలు డేగ కన్నులా పనిచేస్తాయి.

– సంజయ్, ఇన్‌స్పెక్టర్, కొల్లూర్

**ప్రజాభద్రతే లక్ష్యం**



ప్రజలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం మున్సిపాలిటీ పరిధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగానే వందలాది సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాం. మున్సిపాలిటీ ప్రజలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– లలిత, మున్సిపల్ చైర్‌పర్సన్

**సంతోషంగా ఉంది**



సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తుండటం సంతోషంగా ఉంది. గతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వ పనితీరు బాగుంది

– రమణ, టీఎన్‌హెచ్‌పీ అధ్యక్షుడు

# ‘డబుల్’ ఇళ్లను మంజూరు చేస్తాం



అంతారంలో కూలిన ఇల్లును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

**ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్**

మునిపల్లి(అందోల్): రాజకీయ పార్టీలకతీతంగా ఇళ్లు లేని పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. మండల పరిధిలోని అంతారం, పెద్దచల్మెడ, మునిపల్లి, పొల్కంపల్లి గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇళ్లు లేని పేదలతో స్వయంగా మాట్లాడి అర్హులైనవారందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజూరు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, ఎంపీపీ శైలజ, జడ్పీటీసీ మీనాక్షి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శశికుమార్, యూత్ అధ్యక్షుడు అనంద్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నీలం మధు సేవలపై మధుప్రియ పాట



సీడీని ఆవిష్కరిస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల ప్రముఖ సింగర్ మధుప్రియ పాట రాసి స్వయంగా పాడిన గీతాన్ని నీలం మధు నివాసంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ తనపై అభిమానంతో స్వయంగా గీతం రాసి పాడటం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మధుప్రియను సన్మానించారు. గాయకులు సుమన్, సందీప్, స్పందన, ఎన్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలి

ఝరాసంగం(జహీరాబాద్): మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల పాల్గొన్నారు.

**17వ రోజుకు జీపీ కార్మికుల సమ్మె**

సంగారెడ్డి టౌన్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శనివారం 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించబోమన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు రాజేష్, మల్లేశం, భిక్షపతి, రాజు, సువర్ణ, మంగ, రాజు పాల్గొన్నారు.



# విద్యతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ శ్రీధర్

కల్హేర్(నారాయణఖేడ్): విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నారాయణఖేడ్ మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ శ్రీధర్ అన్నారు. మండల పరిధిలోని సిర్గాపూర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి, వంటగదులు, పాఠశాల పరిసరాలు పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే ప్రిన్సిపాల్, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణ, ప్రిన్సిపాల్ శ్యామలదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరిస్తాం

**మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి**

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ సంగారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వర్షం నిండిన కాలనీల్లో సహాయచర్యలు చేపడుతున్నామని తెలిపారు. కాలనీవాసులు ఆందోళన చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

### పొదుపు సంఘాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ సూర్యరావు

కల్హేర్(నారాయణఖేడ్): పొదుపు సంఘాల బలోపేతానికి ఐకేపీ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని అడిషనల్ డీఆర్‌డీఓ సూర్యరావు తెలిపారు. శనివారం కల్హేర్‌లో ఐకేపీ క్లస్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక పెట్టుబడి డబ్బుల రికవరీ, పొదుపు సంఘాల బలోపేత, తదితర అంశాల్లో పనితీరు మెరుగుపడాలని సూచించారు. సమావేశంలో ఫైనాన్స్ డీపీఎంలు కొమురయ్య, మల్లేశం, రవీందర్, ఏపీఎంలు సాయిలు, చంద్రశేఖర్, టిక్యానాయక్, ధన్‌రాజ్‌గిరి, అనంతయ్య, వంశీ పాల్గొన్నారు.

## పండ్ల తోటల పెంపకంపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుజాత

ఝరాసంగం(జహీరాబాద్): ఉపాధిహామీ పథకంలో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులకు ఉపాధి హామీ సిబ్బందికి పండ్ల తోటల పెంపకం ఎంపీడీఓ సుజాత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా 5 ఎకరాలలోపు వ్యవసాయ భూమి, బోరుబావి కలిగి ఉన్న రైతులు పండ్ల తోటలు పెంచుకోవచ్చన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు తప్పకుండా ఫాగింగ్ చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ లక్ష్మయ్య, సూపరింటెండెంట్ మారుతి విఠోబా, ఏపీఓ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

### కిషన్‌రెడ్డిని కలిసిన మల్లికార్జున్‌పాటిల్



కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న మల్లికార్జున్‌పాటిల్

ఝరాసంగం(జహీరాబాద్): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌డ్డిని ఆ పార్టీ కిసాన్ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు మల్లికార్జున్‌పాటిల్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డిని సన్మానించి అభినందనలు తెలిపారు.

# యువత క్రీడారంగంలో రాణించాలి



క్రీడాసామగ్రి పంపిణీ చేస్తున్న మల్లేశం

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని తాటిపల్లి గ్రామంలో యూనైటెడ్, ఎస్పీఆర్ పాఠశాలల ప్రిన్సిపాల్ తాటిపల్లి మల్లేశం యువతకు క్రీడాసామగ్రిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత క్రీడలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, యువత పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేటర్ పుష్పనగేష్ జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. శనివారం డివిజన్ పరిధిలోని సాయినగర్‌కాలనీలో ఆమె పర్యటించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ వర్షం కారణంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

## సంక్షిప్త వార్తలు

**◆ 25న జాబ్‌మేళా**

సంగారెడ్డి టౌన్: జిల్లా ఉపాధిశాఖ ఆధ్వర్యంలో ఇంజో బ్రిడ్జి కంపెనీలో 80 ఉద్యోగాల భర్తీకి ఈ నెల 25న ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని పాత వెలుగు ఆఫీస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయ ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి వందన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 20 నుంచి 25 ఏళ్ల లోపు ఉండాలని, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీఈ/బీటెక్, ఎంఎస్సీ, ఎంసీఏ విద్యార్హతలు ఉన్నవారు అర్హులని తెలిపారు. జీతం రూ.12,500 నుంచి 18,000 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 25న నిర్ణీత సమయంలోగా ఎస్ఎస్సీ మెమో, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 08455271010కు సంప్రదించాలని సూచించారు.

**◆ ఇస్నాపూర్‌లో వైద్య శిబిరం**

పటాన్‌చెరు టౌన్: మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో ఎస్ఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం అమీర్‌పేట్ శిర ఆస్పత్రి అధినేత డాక్టర్ శ్రావణ్‌తేజ పర్యవేక్షణలో ఉచిత కేన్సర్ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి పరిసరాల ప్రాంతాల ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది మొహ్మద్, రాహుల్ పాల్గొన్నారు.

**◆ వర్షపు నీరు నిలవకుండా చూసుకోవాలి**

రాయికోడ్(అందోల్): పంట చేలల్లో వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అభినాష్ వర్మ రైతులకు సూచించారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో శనివారం పంట పొలాలను పరిశీలించారు. ఏఈఓ స్వాతి, రైతులు పాల్గొన్నారు.

**◆ సంకల్పయాత్ర పోస్టర్ ఆవిష్కరణ**

జహీరాబాద్: ఈ నెల 29వ తేదీన సంగారెడ్డిలో పెన్షన్ స్కీమ్ విషయమై టీఎస్‌సీపీఎస్ఈయూ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమం సందర్భంగా వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నర్సింహులు, అమృత్, వసంత్, ప్రసాద్, శ్రీపాల్, సిరాజుద్దీన్, పాండు, సంజీవ్, ప్రదీప్, కపిల్‌కుమార్ పాల్గొన్నారు.

**◆ సిమెంట్ బెంచీల ఏర్పాటు**

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పట్టణంలోని రాయసముద్రం చెరువు, గట్టుపోచమ్మ దేవాలయం వద్ద ఎస్ఆర్ ట్రస్ట్ అధ్యక్షురాలు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి సొంత నిధులతో సిమెంట్ బెంచీలను శనివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు బలరాం, పెంటారెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**◆ నిత్యావసర సరుకుల పంపిణీ**



హత్నూర (సంగారెడ్డి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో వృద్ధాప్యంలో ఉన్న ఓ అవ్వ ఇల్లు కూలిపోయింది. నా అనే వారు లేని పరిస్థితుల్లో ఉన్న వృద్ధురాలికి గమ్యం అసోసియేషన్ చైర్మన్ సురేందర్‌రెడ్డి 15 రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను శనివారం అందజేశారు. మండలంలోని కసాల గ్రామానికి చెందిన చెరువు ముంగటి మల్లమ్మ ఇల్లు వర్షంతో కూలిపోయింది. విషయం తెలుసుకున్న సురేందర్‌రెడ్డి స్పందించి నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంతో గ్రామస్తులు ఆయనను అభినందించారు. అనంతరం సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలన్నారు. నాయకులు రమేష్, అఖిల్, మధుసూదన్ పాల్గొన్నారు.

**◆ శిథిలావస్థ ఇళ్లు కూల్చివేత**

సంగారెడ్డి మున్సిపాలిటీ: పట్టణ పరిధిలో రాంనగర్, శ్రీనగర్‌లో శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను మున్సిపల్ అధికారులు కూల్చివేయించారు. టీపీఎస్ విజయలక్ష్మి, క్లర్క్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**◆ డ్రైవింగ్ లైసెన్సులకు అనూహ్య స్పందన**

నారాయణఖేడ్: ఖేడ్‌లో ఎంబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఈ మేరకు ఫౌండేషన్ చైర్మన్ రోషన్‌రెడ్డి శనివారం దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తులకు గడువు ఈ నెల 31వరకు ఉంటుందని తెలిపారు.

**◆ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు వినతి**

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని ఖాళీ ఇంటి స్థలం ఉన్న అర్హులకు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలు సాయం అందించాలని కోరుతూ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేశ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు కిషన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**◆ తప్పులు లేకుండా చూడాలి**

మునిపల్లి(అందోల్): ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలని బీఎల్ఓ (బుత్‌లేవల్ అధికారు)లకు తహసీల్దార్ శివకుమార్ సూచించారు. శనివారం మండలంలోని మునిపల్లి మోడల్ స్కూల్‌లో పోలింగ్ కేంద్రాల నిర్వహణ, ఎన్నికలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కృపాదానం, ఆర్ఐ రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు వైద్య పరీక్షలు**

కల్హేర్(నారాయణఖేడ్): మండల పరిధిలోని సిర్గాపూర్ కస్తుర్బాగాంధీ బాలికల పాఠశాల, ఎస్సీ బాలుర వసతిగృహంలో శనివారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్గాపూర్ పీహెచ్‌సీ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఓ లలిత, వార్డెన్ కిషన్, సిబ్బంది తారసింగ్ పాల్గొన్నారు.

**◆ కాంగ్రెస్ ఓబీసీ జిల్లా చైర్మన్‌గా మవీన్‌గౌడ్**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్‌గా రామచంద్రాపురం పట్టణానికి చెందిన మవీన్‌గౌడ్‌ను నియమిస్తూ శనివారం రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మవీన్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

**◆ నియామకం**

నారాయణఖేడ్: విరాట్ విశ్వకర్మ సొసైటీ రాష్ట్ర కార్యదర్శిగా, సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జీగా సిర్గాపూర్ మండలంలోని చీమల్‌పాడ్‌కు చెందిన లక్ష్మీనరసింహాసేనాచారిని నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి శ్రీశైలంచారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహాసేనాచారి మాట్లాడుతూ విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.